GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

T MEDIA

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం- జనవరి 01-2024 పేజీలు : 4

## రేవంత్ తో అమెజాన్ బృందంబేటి

### -పెట్టుబడులపై చర్చ



**టీ మీడియా, జనవరి 10,హైదరాబాద్ :** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సచివాలయంలో రేవంత్ రెడ్డితో సమావేశమైన అమెజాన్ బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలపై చర్చించింది. ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను రేవంత్ రెడ్డి అమెజాన్ ప్రతినిధులకు వివరించారు. సచివాలయంలో ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

**కైట్ ఫెస్టివల్ కు ఆహ్వానం ..**

తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరగనుంది. ఈ ఇంటర్నేషనల్ కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ రావలసిందిగా నిర్వాహకులు ముఖ్యమంత్రి రేవంత్ కు ఆహ్వానం అందించారు.. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా పాల్గొన్నారు..

### కాళేశ్వరం లో..

# కళ్లు బైర్లు కమ్మేలా అవినీతి

## - రూ.లక్షా రెండు వేల కోట్లకు వ్యయం - అవసరం లేని పనులు

### - వివిధ సంస్థలకు 56 కాంట్రాక్టులు

### -168 పేజీలతో కాగ్ డ్రాఫ్ట్ రిపోర్టు





**టీ మీడియా, జనవరి 10, హైదరాబాద్:**లక్ష కోట్ల రూపాయలకు పైగా వ్యయం.. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టు.. పెద్ద ఎత్తున అవినీతి.. అంతకుమించి నిధుల గోల్‌మాల్ ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇది ఒక ఆరోపణ మాత్రమే. ఇది నిజమని నమ్మినవారు ఉన్నారు.. కేవలం ఆరోపణ అని కొట్టిపారేసినవారు ఉన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు కొందరు అధికారులకు, మరికొందరు రాజకీయ నాయకులకు ఏటీయం మిషన్ గా మారిందని విమర్శించిన వారూ ఉన్నారు. ఇది కేవలం అతిశయోక్తి అని కొట్టి పడేసినవారూ ఉన్నారు. అయితే ఇప్పుడు కాళేశ్వరం అవినీతి అఫీషియల్ గా నిజమని నిర్ధారనైంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన డ్రాఫ్ట్ నివేదికలో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలను కాగ్ ఎండగట్టింది.

అనుమతికి ముందే మొత్తం 168 పేజీల రిపోర్టు ద్వారా ప్రాజెక్టు అవినీతిని కాగ్ తీవ్రంగా ఎండగట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును 2018 జూన్ లో సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతించగా.. ఆశ్చర్యకరమైన రీతిలో అనుమతికి ముందే కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన వివిధ పనులను కాంట్రాక్టర్ లకు కేటాయించినట్లు కాగ్ రిపోర్టులో ప్రస్తావించారు.ఇలా చేయడం ద్వారా డిపీఆర్ ను అసలు పట్టించుకోకుండానే పనులు ప్రారంభించడం వెనుక ఏదో మర్మం ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడే పెద్ద ఎత్తున గోల్ మాల్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సి డబ్ల్యు సి సూచనలకు విరుద్ధంగా 2019 జూన్ నుండి 2020 ఫిబ్రవరి మధ్య కాలంలో మూడో టీఎంసీని ఎత్తిపోసే మోటర్లు, పంపులను సమకూర్చాలంటూ 28వేల151 కోట్ల రూపాయల కాంట్రాక్టును నిర్మాణ సంస్థలకు ఇచ్చారని కాగ్ పేర్కొంది. దీనికి ఏ మాత్రం శాస్త్రీయత, సహేతుకత కానీ లేదని%ా%దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోయినా నిర్మాణవ్యయం మాత్రం భారీగా పెరిగినట్లు కాగ్ గుర్తించింది. ఈ మూడో టీఎంసీ నిర్మాణ ప్యాకేజీల్లో అత్యధిక భాగాన్ని ఒకే కంపనీ దక్కించుకోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఇప్పుడు కాళేశ్వరం అవినీతి మొత్తం ఆ కంపెనీ చుట్టే తిరుగుతోంది.అవసరం లేకపోయినా చేపట్టిన వివిధ పనుల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం లక్షా రెండు వేల కోట్ల రూపాయలకు చేరిందని కాగ్ నివేదికలో పేర్కొంది. అయితే డిపిఆర్ లో మాత్రం ప్రాజెక్టు వ్యయం కేవలం 63 వేల కోట్లుగానే నిర్ధారించారు. అవసరం లేని పనుల వల్లే ప్రాజెక్టు వ్యయం భారీగా పెంచారని కాగ్ గుర్తించింది.ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం లక్షా 49 వేల కోట్ల రూపాయలకు చేరుతుందని కాగ్ రిపోర్టులో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల్లో 73 శాతం వరకు రుణాల రూపంలోనే ప్రభుత్వం సమకూర్చుకుందని కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది.

### వివిధ సంస్థలకు కాంట్రాక్టులు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా వివిధ దశల్లో మొత్తం 56 వర్క్ కాంట్రాక్టులను వివిధ సంస్థలకు ఇచ్చారు. ఇందులో ఇపీసీ ప్రాతిపదికన ఇచ్చిన 17 పనుల విలువ 30 వేల కోట్ల రూపాయలు మాత్రమే. మిగిలిన 39 పనులను గంపగుత్తగా యూనిట్ ప్రైస్ ప్రాతిపదికన ఇచ్చేశారు. దీని విలువ ఏకంగా 52 వేల కోట్ల రూపాయలు కావడం గమనార్హం. యూనిట్ ప్రైస్ ప్రాతిపదికగా ఇచ్చిన పనులకు సంబంధించిన పూర్తి వివరాలను కూడా ఇరిగేషన్ శాఖ వెల్లడించలేదని కాగ్ పేర్కొంది. ఇక ఈ మొత్తం కాంట్రాక్టుల్లో 21 కాంట్రాక్టులు లిఫ్ట్ పంపుసెట్ల సరఫరాకు సంబధించినవే కాగా, ఇందులో అత్యధిక భాగం పనులను ఒకే సంస్థ దక్కించుకుంది. ఇందులోని నాలుగు ప్యాకేజీల్లో పంపుసెట్లకు సంబంధించి అయా కాంట్రాక్టర్లకు ప్రభుత్వరంగ బీహెచ్ఈఎల్ సంస్థ సరఫరా చేసిన దరలకి, ప్రభుత్వం చెల్లించిన ధరకు మధ్య 300 శాతం వ్యత్యాసం ఉండటాన్ని కాగ్ ఆక్షేపించింది.

ఈ నాలుగు ప్యాకేజీల్లో బీహెచ్ఈఎల్ కు కాంట్రాక్టర్లు కేవలం 1686 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించగా, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం మాత్రం 7211 కోట్ల రూపాయలు చెల్లించడం గమనార్హం. అంటే ఇక్కడే 5 వేల కోట్ల రూపాయలకు పైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు కాగ్ గుర్తించింది. బిల్లులు చెల్లించే ముందు ఆయా కాంట్రాక్టర్లు వివిధ సంస్థల నుండి కొనుగోలు చేసిన ఎక్విప్మెంట్ ఇన్వాయిస్ లను ఇరిగేషన్ శాఖ అధికారులు అసలు పరిశీలించారా..లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

### ఈపీసీ పద్ధతిలో కేటాయించలేదు..

ప్రాజెక్టు రీ ఇంజనీరింగ్ తర్వాత చేపట్టిన పనులను ఈపీసీ పద్ధతిలో కేటాయించలేదని తమ ఆడిట్ లో గుర్తించినట్లు కాగ్ పేర్కొంది. దీనివల్లే ప్రాజెక్టులో అవినీతి, అంచనాలు పెరిగిపోయాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఓ వైపు ఇరిగేషన్ కార్యాలయాలపై విజిలెన్స్ దాడులు జరుగుతుండటం మరోవైపు కాళేశ్వరంపై ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తుండటం ఆసక్తిరేపు తోంది. ఈ వ్యవహారం ఎక్కడి వరకు వెళ్లనుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే మూడు బ్యారేజీల నిర్మాణాల్లో అవకతవకలపై జ్యూడిషియల్ విచారణకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం, తాజాగా ప్రాజెక్టుపై సమగ్ర విచారణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్ఎస్‌కు దడ: మంత్రి పొన్నం

కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిగితే బీఆర్ఎస్‌కు దడ పుడుతోందని ఆరోపించారు మంత్రి పొన్నం ప్రభాకర్. బీఆర్ఎస్ నాయకులు అవినీతి చేయనపుడు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతి విషయంలో కిషన్ రెడ్డి కేసీఆర్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఎందుకు విచారణ జరపడం లేదని పొన్నం అన్నారు.

### ఆయోధ్య ఆలయ ఆహ్వానాన్ని

# తిరస్కరించిన కాంగ్రెస్

### -హాజరుకావడం లేదని ప్రకటన



**టీ మీడియా, జనవరి 10,ఢిల్లీ :**అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి తమ పార్టీ నేతలు హాజరుకావడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. జనవరి 22వ తేదీన ఆలయ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని సోనియాగాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే, అధీర్ రంజన్ చౌదరికి ఆహ్వానాలు అందాయి. అయితే అయోధ్య పేరుతో కాంగ్రెస్ -ఆర్ఎస్ఎస్ రాజకియాలు చేశాయని కాంగ్రెస్ ఆరోపించింది. అందుకే ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదని లేఖలో స్పష్టం చేసింది కాంగ్రెస్.అయోధ్యలో రామమందిర శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పాల్గొనడంపై కొనసాగుతున్న ఊహాగానాలు, ఉత్కంఠకు తెరపడింది. ఆర్ఎస్ఎస్, బీజేపీల కార్యక్రమం అంటూ కాంగ్రెస్ పార్టీ ఈ మొత్తం కార్యక్రమానికి దూరంగా ఉంది. అయోధ్య రామాలయ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని , అందుకే లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టారని కాంగ్రెస్ విమర్శించింది. మతం అనేది వ్యక్తిగత అంశం అని కాంగ్రెస్ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ గానీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గానీ హాజరు కావడం లేదని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. వీరితో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్‌రంజన్ కూడా పాల్గొనరు. రామ మందిర ప్రతిష్టకు సంబంధించిన ఆహ్వానాన్ని ఈ నేతలు తిరస్కరించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేరుతో ఒక ప్రకటన విడుదల చేసింది కాంగ్రెస్. గత నెలలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు అధీర్ రంజన్ చౌదరికి అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందింది. కోట్లాది మంది భారతీయులు రాముడిని పూజిస్తారు. మతం అనేది మనిషి వ్యక్తిగత విషయం, కానీ కొన్నేళ్లుగా అయోధ్యలో రామమందిరాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయని జైరాం రమేష్ ఆరోపించారు .కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే సగం కట్టిన ఆలయాన్ని ప్రారంభిస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు జైరాం రమేష్. 2019 నాటి గౌరవనీయమైన సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అంగీకరిస్తూ, ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తూ, మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, అధీర్ రంజన్ చౌదరి ఈ కార్యక్రమాన్ని గౌరవ పూర్వకంగా తిరస్కరించారన్నారు.జనవరి 22న జరగనున్న రామమందిరప్రాణ వేడుకలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా 6 వేల మందికి పైగా ఆహ్వానాలు పంపారు ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు. అయితే, సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, అధీర్ రంజన్ చౌదరితో పాటు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావడం లేదు. సీపీఐ (ఎం) నేత సీతారాం ఏచూరి కూడా ఆహ్వానాన్ని తిరస్కరించారు.

### మరో పొలిటికల్ షాక్ ఇచ్చిన అంబటి

# జనసేనలోకి మాజీ క్రికెటర్.?



**టీ మీడియా, జనవరి 10, హైదరాబాద్:** ఆయన ప్రీమియర్ లీగ్‌లో హిట్ కొట్టాడు. పొలిటికల్ పిచ్‌పై తడబడ్డాడు. మొదట వైసీపీలో చేరి, ఆ తర్వాత జనసేనలో చేరిపోయేందుకు సిద్ధమయ్యారు మాజీ క్రికెటర్ అంబటి రాయుడు. తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు భేటీ అయ్యారు. వైసీపీలో చేరిన వారం రోజులకే రాజీనామా చేసిన అంబటి రాయుడు.. కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పుకొచ్చారు. అయితే హఠాత్తుగా ఆయన హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్‌తో భేటీ కావడం ప్రాధాన్యతసంతరించుకుంది.రాజకీయాల్లోకి సినిమా స్టార్స్ తరహాలోనే క్రికెటర్ల ఎంట్రీ కామనైపోయింది. చాలామంది క్రికెటర్లు రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ అయ్యారు. వారిలాగే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైన అంబటి రాయుడు కూడా అదే రకంగా పొలిటికల్ పిచ్‌పై రాణిస్తారని చాలామంది అనుకున్నారు. ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన కొద్దిరోజుల్లోనే పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టేందుకు గ్రౌండ్ వర్క్ చేసుకున్నారు రాయుడు. ఏపీలో అధికార వైసీపీ తరపున పొలిటికల్ గేమ్ అడేందుకు రెడీ అయిపోయారు. ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రాకు రాయుడు ఓ బ్రాండ్ అంబాసిడర్ అంటూ సీఎం జగన్ కూడా ప్రకటించారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ.. అంబటి పొలిటికల్ ఇన్నింగ్స్‌కు అప్పుడే బ్రేక్ పడిపోయింది. వైసీపరాజకీయాల్లో జరుగుతున్న మార్పుల ప్రభావమో లేక తాను ఆశించిన ప్లేస్ దక్కలేదో తెలియదు కానీ.. పార్టీలో చేరిన పది రోజులకే రిటైర్డ్ హర్ట్ అయ్యారు రాయుడు. లోలోపల ఏం జరిగిందో ఏమో కానీ.. అంబటి మాత్రం పొలిటికల్ మ్యాచ్ ప్రారంభం కాకముందే జగన్ టీమ్ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. వైసీపీలో చేరిన 10 రోజుల్లోనే ఆ పార్టీని అంబటి రాయుడు వీడడం వెనుక చాలా కారణాలు ఉన్నాయన్నారు. తనకు దుబాయ్‌లో లీగ్ లు ఉన్నాయని అందుకే రాజకీయాలకు విరామం ప్రకటించానని అన్నారు. కానీ తాజాగా పవన్ తో భేటీ ద్వారా అసలు క్లారిటీ వచ్చినట్లయింది.ఏపీలో తెలుగుదేశం పార్టీ జనసేన కూటమితో కలిసి వెళ్తేనే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ఉద్దేశంతో అంబటి వైసీపీ వీడినట్లు ఆయన అభిమానులు చెబుతున్నారు. అంబటి రాయుడు కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో.. జనసేనకు దగ్గరయ్యారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పవన్ కల్యాణ్‌తో అంబటి రాయుడు భేటీ నేపథ్యంలోనే రాయుడు రాజకీయ భవిష్యత్‌పై ఫుల్ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఆయన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి జనసేన తరపున పోటీ అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోం



### చంద్రబాబు పచ్చి మోసగాడు

# జగన్ పేదల పక్షపాతి

### -టీడీపీని విడిన కేశినేని నాని వ్యాఖ్యలు.

**టీ మీడియా, జనవరి 10,విజయవాడ :**కేశినేని నాని, కేశినేని చిన్ని మధ్య మొదలైన చిన్న వివాదం కాస్తా చినికి చినికి గాలివానగా మారింది. చివరకు కేశినేని నాని టీడీపీని వీడాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని రోజులుగా టీడీపీలో జరిగిన పరిణామాల పట్ల ఎంపీ కేశినేని నాని తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే.. తనకు విజయవాడ ఎంపీ సీటు ఇచ్చేందుకు టీడీపీ నాయకత్వం సానుకూలంగా లేదని సంకేతాలు రావడంతో భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టారు. తిరువూరులో చంద్రబాబు సభ ఏర్పాట్లలో జరిగిన గొడవ అనంతరం.. ఇక టీడీపీలో ఉండబోనంటూ కేశినేని నాని కుటుంబం నిర్ణయం తీసుకుంది. కేశినేని భవన్‌కి ఫ్లెక్సీలను సైతం తొలగించారు. ఈ క్రమంలో అంతా అనుకున్నట్లుగానే.. కేశినేని నాని బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. లేటెస్ట్‌గా వైసీపీ అధినేత సీఎం జగన్‌తో కేశినేని నాని భేటీ అయ్యారు. జగన్‌తో మీటింగ్‌కి ముందు నానితో వెల్లంపల్లి, అయోధ్యరామిరెడ్డి, దేవినేని అవినాష్ భేటీ అయ్యారు. అనంతరం వారితో కలిసి జగన్ తో నాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానంగా వైసీపీలో చేరికపై సీఎం జగన్‌తో చర్చలు జరిపారు.. అంతేకాకుండా పార్టీలో ప్రాధాన్యత తదితర అంశాలను కూడా చర్చించినట్లు తెలుస్తోంది.జగన్ తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు.. చంద్రబాబు పచ్చి మోసగాడంటూ విరుచుకుపడ్డారు. కుటుంబాల మధ్య చిచ్చుపెట్టారని.. సొంత కుటుంబ సభ్యులతో కొట్టించాలని చూశారని మండిపడ్డారు. ఇకపై తన రాజకీయ ప్రయాణం వైసీపీతోనేనని కేశినేని నాని పేర్కొన్నారు. విజయవాడ అభివృద్ధిపై చంద్రబాబుకు చిత్తశుద్ధిలేదని.. విజయవాడ అభివృద్ధికి కనీసం రూ.100 కోట్లు ఇవ్వలేదంటూ పేర్కొన్నారు. తన విషయంలో టీడీపీ ప్రొటోకాల్ ను విస్మరించిందని.. నాని పేర్కొన్నారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అంటూ కొనియాడారు. చంద్రబాబు ఏపీకి అవసరం లేని వ్యక్తి అంటూ ఫైర్ అయ్యారు.చంద్రబాబు మోసగాడని ఈ ప్రపంచానికి తెలుసు.. కానీ ఇంత మోసం చేస్తారని తెలియదంటూ కేశినేని నాని పేర్కొన్నారు. తనకు విజయవాడ అంటే పిచ్చి ప్రేమని.. తాను ఎవరిని సీట్ ఇవ్వమని అడగలేదని పేర్కొన్నారు. టీడీపీ, జనసేనకు 40 సీట్లకంటే ఎక్కువ రావంటూ కేశినేని పేర్కొన్నారు.

### వాహనదారులకు గుడ్ న్యూస్..

#### -31వరకు పెంచుతూ సర్కార్ నిర్ణయం..

**టీ మీడియా, జనవరి 10, హైదరాబాద్:**

ట్రాఫిక్ చలాన్లపై తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన డిస్కౌంట్ ఆఫర్ గడువు 10అర్ధరాత్రితో ముగి సింది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ చలాన్ల గడువును ఈ నెల 31వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గడువు దగ్గరపడటం.. చలానా చెల్లింపులు ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం తేదీని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కాగా.. గత నెల 26 నుంచి పెండింగ్ చలాన్లను క్లియర్ చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 3.59 కోట్ల పెండింగ్ చలాన్లు ఉండగా.. కోటికిపైగా చలాన్లు క్లియర్ అయినట్లు అధికారులు చెప్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 113 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. అత్యధికంగా హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో 66.57 లక్షల చలాన్లు క్లియర్ అయ్యాయి.ఈ చలాన్లను మీసేవతో పాటు యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించింది. ఈ భారీ డిస్కౌంట్ ఆఫర్ మరికొన్ని గంటల్లో ముగియనుంది. అయితే సర్వర్ సమస్యతో చలాన్లు కట్టలేకపోయామని.. మరోసారి గడవును పొడించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ గడువు తేదీని పెంచింది.ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై పెండింగ్‌లో ఉన్న చలాన్లపై 90 శాతం రాయితీని ప్రకటించగా, బైక్‌లపై 80 శాతం, ఫోర్ వీలర్స్, ఆటోలకు 60 శాతం, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలకు 50 శాతం తగ్గింపుతో భారీ రాయితీ ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో క్రిసెంట్ విద్యార్థుల ప్రతిభ




**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి బ్యూరో :** బీఎంర్ మార్షల్ ఆర్ట్స్ పెద్ద పెల్లి వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే కుంగ్ ఫు పోటీలు నిర్వహించడం జరిగింది. డ్రాగన్ కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్ మరియు వ్యవస్థాపకుడు శ్రీ కొండిల్ల సదానందం శిక్షణలో ఆరితేరిన క్రిసెంట్ ఉన్నత పాఠశాలలోని శ్రీరాంపూర్ విద్యార్థులు బ్లాక్ బెల్ట్ లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరిగిన అభినందన కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఎస్సై శ్రీ శ్రీనివాస్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరిగింది బ్లాక్ బెల్ట్ లు సాధించిన నూనేటి అభినవ్ శ్రీ రామోజీ సూర్య తేజ, రామ్ తేజ, విట్టం నిత్యశ్రీ మరియు ఎల్లో బెల్ట్ చైత్ర లు సాధించగా లాస్య చైత్ర దక్ష అభినవ్ అఖిలేశ్వర్ హర్షవర్ధన్ హర్షిని శ్రీ లు బంగారు పథకాలు సాధించారు. వీరికి బెల్టులు పథకాలు ఎస్సై శ్రీనివాసుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని సూచించారు. కరాటే మాస్టర్ సదానందం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి అని ప్రతి ఒక్కరు ఈ కోణంలో ఆలోచించి నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీ నసీర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి దళితుడికి దళిత బంధు ఇవ్వాలి

**- కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన దళిత సంఘాల ఐక్యవేదిక**

**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వా యంలో దళితులు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రతి దళితుడు ధనవంతుడు కావాలనే ఉద్దేశంతో 10 లక్షల రూపాయలు రుణాన్ని ఇచ్చి తమకు నచ్చిన వ్యాపారాల్లో అభివృద్ధి చెందాలని విషయాన్ని నిర్దేశించింది.

ఇందులో మొదటి విడతగా 100 మందికి దళిత బంధు ఇచ్చారు.రెండో విడతగా కూడా 1200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటికి సంబంధించి బ్యాంకు వారి సూచనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన విధంగా దరఖాస్తు చేసుకున్నారు. అవన్నీ సంబంధిత అధికారుల దగ్గర, కలెక్టర్ దగ్గర ఉన్నాయి.

**బ్యాంకర్ల దగ్గర కూడా అవి ఎకౌంటు ఓపెన్ చేసి ఉన్నాయి.**

ఇప్పుడు వాటిపై తగు విధమైన చర్యలు తీసుకోని 10 లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయాలని మనవి దళితులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ అభయ హస్తం పేరున 12 లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేస్తామన్నారు సంతోషం కానీ గతంలో దరఖాస్తు చేసినటువంటి వారికి 10 లక్షల రూపాయలు దళిత బంధు ఇస్తారా ?,లేదా 12 లక్షల రూపాయలు అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు ఆర్థిక సహాయం చేస్తారా? లేదా సమస్త దళిత లోకానికి తెలియజేయాలని సవినంగా విజ్ఞప్తి చేశారు. గతంలో దరఖాస్తు చేసిన వారికి దళిత బంధు ఇవ్వాలని, బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కోళ్ల వెంకటేష్, గంధం పరంజ్యోతి, వెంకట్ పెబ్బేరు, గంధం శరవంద,పానుగంటి సురేష్, గంధం విజయ్ కుమార్, గోర్ల ప్రేమ్,రాములు, వడ్డెమాన్ రవి,దానేలు, సిరివాటి శెంకర్,అఖిలేందర్, కొమ్ము లక్ష్మి,ద్వారపోగు నాగరాజు,మధు మాలపల్లి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో రెండు బైకులు దగ్ధం లక్షల్లో నష్టం



**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి బ్యూరో :** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని తారుపల్లి గ్రామంలోని దోబిళ్ళ మొగిలి కి చెందిన పూరి గుడిసె మంగళవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పూర్తిగా కాలి దగ్ధం అయినట్లు సంబంధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లో ఎవరు లేరని తీర్థయాత్రలకు వెళ్లినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రమాదంలో రెండు బైకులు, ఒక సైకిల్,50 వేల విలువ గల టేకు కర్ర,పెట్రోల్ పంపు,వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు పూర్తిగా కాలిపోయి లక్షల్లో నష్టం జరిగినట్లు వారు బోరున విలిపించారు. ఈ ప్రమాదంలో పశువులు కూడా ప్రాణపాయంతో కొట్టుమీట్టు ఆడుతున్నాయని వారు తెలిపారు.సంఘటన స్థలానికి పోలీసులు ఎస్ ఐ శ్రీనివాస్, ఆర్ ఐ నరసింగం వెళ్లి పరిశీలించారు.అలాగే పశువుల డాక్టర్ వెళ్లి పశువులను పరిశీలించినట్లు వారు అన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు. ఈ సంఘటన స్థలానికి మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, మాజీ సర్పంచులు సతీష్,సదయ్య వెళ్లి పరిశీలించి ప్రభుత్వం తరఫున తప్పకుండా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం

**- ఆర్డిఓ కి అర్జీ చేసుకున్న ఎంపీటీసీలు**



**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం కొరకై మండల పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని పాలకుర్తి మండలం లోని పుట్నూర్ ఎంపీటీసీ గంగాధర రమేష్. ఎలకలపల్లి ఎంపీటీసీ పాలడుగుల సతీష్.బసంత్ నగర్ ఎంపిటిసి పాత భాగ్యలక్ష్మి రవీందర్. పాలకుర్తి ఎంపిటిసి దుర్గం కుమార్. కొత్తపల్లి ఎంపీటీసీ సంతపురి ప్రియాంక మహేష్ లు పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ని స్వయంగా కలిసి పంచాయతీ రాజ్ యాక్ట్ 1994 ప్రకారం పాలకుర్తి ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం కొరకు వెంటనే పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్జి పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడెపు రాజేశం, కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టబోయిన రాజ్ కుమార్ యాదవ్,రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ గాదె సుధాకర్, మాజీ సర్పంచ్ పొన్నం సత్తయ్య గౌడ్, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి,మాజీ ఎంపిటిసి దేవానందుల రాజమౌళి, మాదాసు శ్రవణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



**టీ మీడియా, జనవరి 10, జన్నారం:** మండలంలోని గోండు గూడ గ్రామంలో బుధవారం రోజున లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి చైర్మన్గా గోలి మణికుమార్ కాసావత్ జగదీష్ నిర్వహించారు. తదనంతరం గ్రామంలోని ప్రజలకు మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు శెట్టి రాజశేఖర్, కార్యదర్శి వావిలాల రాజేందర్, కోశాధికారి వెలగందుల సురేష్, సభ్యులు రాజన్న, అంజిత్ రావు ,మల్లేష్, సుదీర్, తదితరులు పాల్గొన్నారు

## ఆదివాసి సేన గ్రామ కమిటీ ఎన్నిక



**టీ మీడియా, జనవరి 10, జన్నారం:** మండలంలోని కవ్వల్ గ్రామపంచాయతీ పరిధిలోగల పాలాగోరి గ్రామ అభివృద్ధికై బుధవారం రోజున ఆదివాసి పెద్దలు రాయి సెంటర్ సర్ మేడి పోసం సోనేరావు మండల ఆదివాసి సేన అధ్యక్షుడు ధ్రువ యశ్వంతరావు ఆధ్వర్యంలో పాలాగోరి ఆదివాసి సేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీడం మోతి రామ్,ఆత్రం జ్యోతిరావు, కోశాధికారిగా తుడుషం సీతారాం, ప్రచార కార్యదర్శి గెడం తెలంగారావు, లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి గా ఆత్రం లచ్చు తదితరులను ఎన్నుకున్నారు. వీరంతా గ్రామ అభివృద్ధికై ప్రభుత్వానికి వారదులుగా సమస్యలను చట్టపరంగా పరిరక్షించుటకు ఎన్నుకోబడిన వారిని తెలియజేశారు.

## ఏసీబీకి పట్టుబడ్డ పి ఆర్ ఏఈ, కార్యదర్శి



**టీ మీడియా, జనవరి 10,బెల్లంపల్లి :** పంచాయతీరాజ్ ఏఈ, కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పెరికపల్లి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల కోసం బిల్ చేయడానికి బెల్లంపల్లిలో పనిచేస్తున్న పంచాయతీ రాజ్ ఏఈ పరంజ్యోతి, పెరకపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి వీరబాబులు రూ.15000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ డి.ఎస్.పి వై రమేష్ బృందం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

# టికెట్ కోసం ముగ్గురు నేతల ప్రయత్నం.

**. -ఆశలు పెట్టుకున్న వివేక్ తనయుడు**

**-పోటీ చేసేది ఎవర నే ఆసక్తికర చర్చ**




**టీ మీడియా, జనవరి 10,పెద్దపల్లిబ్యూరో:** పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంది. ఏ పార్టీ నుండి ఏ అభ్యర్థి పోటీ చేస్తారనే అంశంపై చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ నుండి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసేది ఎవరు అనే విషయంపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏకపక్ష విజయాన్ని సాధించి రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టింది కాంగ్రెస్. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను సైతం అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిణమించాయి ఈ పార్టీకి. అందుకే అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఎవరు అనే అంశం హాట్ టాపిక్ గా మారింది. గతంలో ఈ నియోజకవర్గం నుండి అత్యధికులు నాన్ లోకల్ అభ్యర్థులే పోటీ చేయడంతో, ఈసారి ఎన్నికల్లో లోకల్ కాండేటా..? మళ్లీ నాన్ లోకల్ క్యాండెటా..? అనే అంశంపై చర్చ కొనసాగుతోంది.గత పార్లమెంటు ఎన్నికల్లో వికారాబాద్‌కు చెందిన మాజీ మంత్రి ఆగం చంద్రశేఖర్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి ఎన్నికల్లో %దీ=ూ% అభ్యర్థి బోర్లకుంట వెంకటేష్ నేతకాని విజయం సాధించారు. అత్యధిక ఓట్లను సాధించి, ఆగం చంద్రశేఖర్ సమీప ప్రత్యర్థిగా రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ వెంకటస్వామి మనుమడు, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జోరుగా కొనసాగుతోంది. అయితే జరుగుతున్న ప్రచారానికి అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వంశీకృష్ణ వైపే మొగ్గుచూపుతుందా..? లేదంటే గతంలో ఇక్కడి నుండి పోటీ చేసి సత్తా చాటుకున్న ఆగం చంద్రశేఖర్ కు మరో మారు అవకాశాన్నికల్పిస్తుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది.జిల్లా మంత్రిగా ఉన్న దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఈ ప్రాంత పార్లమెంట్ స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశాలు ఉన్న దరిమిలా వారిద్దరిని కాదని మరో అభ్యర్థిని రంగంలోకి దింపుతారా అనే చర్చ కూడా కొనసాగుతోంది. గడ్డం వంశీ కృష్ణకు పెద్దపల్లి ఎంపీ టికెట్ ను కేటాయిస్తే రాజకీయ వారసత్వంతో పాటు లోకల్ క్యాండేట్ అనే అస్త్రంతో బయటపడవచ్చనే అభిప్రాయాలు పలువురు నుండి వ్యక్తమవుతున్నాయి. అలా కాదని ఇతరులను ఇక్కడి నుండి పోటీ చేయిస్తే నాన్ లోకల్ క్యాండేట్ అనే ముద్ర పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపుస్థానికుడైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఇక్కడి నుండి ఎంపీగా బరిలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం..ఈ నేపథ్యంలో పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలను క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్ అధిష్టానం పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి ఎంపికపై తీసుకోబోయే నిర్ణయం సర్వత్ర ఆసక్తికరంగా మారింది. ఈ నియోజకవర్గంలో సింగరేణి కార్మికులు అధికంగా ఉన్నారు. దీంతో కార్మికుల్లో పట్టున్న నేత కోసం దృష్టి పెడుతున్నారు పార్టీ నేతలు. ఈ సీట్లో విజయం సాధిస్తామనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. పూర్తిగా విభేదాలు పక్కన పెట్టి బలమైన అభ్యర్థిని రంగంలో దింపే ఆలోచనలో ఉంది కాంగ్రెస్..

## మధురై కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**-వదిలిపెట్టనంటున్న కాంగ్రెస్ ఎంపీ..**



**టీ మీడియా, జనవరి 10, మధురై :** తెలంగాణ రాజకీయాలు అప్పుడూ.. ఇప్పుడూ అని లేదు.. ఎప్పుడూ హీటు పుట్టిస్తూనే ఉంటాయి.. ఒక పార్టీ ఒకటంటే.. మరో పార్టీ రెండంటుంది.. ఇంతటితో ఆగకుండా .. ఒకదానికొకటి విమర్శల బాణాలతో దూసుకెళ్తునే ఉంటాయి. అసెంబ్లీ ఎన్నికల నాటినుంచి మొదలైన ఈ వేడి.. ఇప్పటికీ చల్లరడం లేదు.. అధికార కాంగ్రెస్.. ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మధ్య వాడీవేడి వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈ తరుణంలో తెలంగాణ కాంగ్రెస్ మాజీ ఇన్‌ఛార్జ్, ఎంపీ మాణిక్కం ఠాగూర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో షేర్ చేసిన ఫోటోలు రాజకీయంగా మరింత వేడిరాజేశాయి. ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధురై కోర్టు ఆవరణలో కూర్చొని ఉన్న ఫోటోలను మాణిక్కం ఠాగూర్ షేర్ చేసి తనపై వచ్చిన ప్రతి ఆరోపణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ స్పష్టంచేశారు.

మాణిక్కం ఠాగూర్ వేసిన పరువునష్టం దావా కేసులో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మధురై కోర్టుకు హాజరయ్యారు. వీరు కోర్టు ఆవరణలో కూర్చున్న ఫోటోలను 'ఎక్స్' వేదికగా షేర్ చేసిన ఠాగూర్.. "మాపై వచ్చిన ప్రతి ఆరోపణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారు నాపై చేసిన తప్పుడు ఆరోపణలపై స్పందిస్తూ మధురై కోర్టులో పరువు నష్టం కేసు వేశాను. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సుధీర్ రెడ్డి ఇద్దరూ మదురై కోర్టుకు హాజరుకాగా.. ధర్మాసనం వారిపై ఎన్‌బిడబ్ల్యూ (నాన్ బెయిలబుల్ వారంట్) జారీ చేసింది.." అంటూ ఎక్స్‌లో రాశారు.

## మద్దెల రాజయ్యను కరీంనగర్ సిటీలోకి ఆహ్వానించిన ముత్తారం మాజీ ఎంపీపీ, జెడ్పిటిసి



**టీ మీడియా, జనవరి 10, ముత్తారం :** ముత్తారం మండలంలోని ఆదవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, తెలంగాణ ఐటీ, భారీ పరిశ్రమల,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వీరాభిమాని మద్దెల రాజయ్య మంథని నియోజకవర్గంలో రావణ రాజ్యం పోయి రామరాజ్యం రావాలని కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు అహర్నిశలు కృషిచేసి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు గెలుపులో తన వంతు కృషిచేసిన మద్దెల రాజయ్య అడవిశ్రీరాంపూర్ లోని తన ఇంటి వద్ద నుండి శ్రీ రాజరాజేశ్వర స్వామి వేములవాడ ఆలయానికి పాదయాత్రతో బయలుదేరి మొక్కులు చెల్లించుకుని తలనీలాలు సమర్పించుకోవడానికి బయలుదేరినాడు. ఈ పాదయాత్ర లో భాగంగా కరీంనగర్ సిటీలోకి ఆహ్వానించిన సిటీ కాంగ్రెస్ నాయకులు ఇందులో భాగంగా గీతభవన్ వద్ద ఉన్న ఇంద్ర గాంధీ విగ్రహం వద్ద ముత్తారం మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు మైదం భారతి వరప్రసాద్ గారి ఆధ్వర్యంలో శాలువా ,పువ్వుల మాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సిటీ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,కమల్,ఎంపీటీసీ విజేపల్ రెడ్డి,మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, కరీంనగర్ సిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్




**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో కెటిఅర్ . వరుస సమీక్షల్లో పాల్గొంటున్న కో.ఆర్డినేషన్ కమిటీ సభ్యులు నిరంజన్ రెడ్డి ,రావుల చంద్రశేఖరరెడ్డి తెలంగాణ భవన్ నందు నిర్వహించిన వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.అర్ మాట్లాడుతూ తల్లడిల్లిన తెలంగాణను 10ఏండ్ల పాటు చల్లగా కపాడుకున్నాము. అసెంబ్లీ ఎన్నికల ముందు మాట్లాడాకోవడానికి అవకాశం రాలేదని కొన్ని తప్పిదాల వల్లే అధికారం కోల్పోవలసి వచ్చింది అని అన్నారు.మన గళం,బలం పార్లమెంట్లో వినిపించే సమయం ఆసన్నమైందని అన్నారు. మన నిర్లక్ష్యం వల్ల అధికారం ఢిల్లీ చేతిలోకి వెళ్లిందని తిరిగి తెలంగాణ ప్రయోజనాలు ఢిల్లీకి తాకట్టు కాంగ్రెస్ పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతుందని అన్నారు.పార్టీనీ క్షేత్ర స్థాయి నుండి బలోపేతం చేస్తామని అన్నారు.ఈ సమావేశములో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎం.పి రావుల చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** చిట్యాల గ్రామంలో వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా చిట్యాల గ్రామపంచాయతీ ఆవరణలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పరమేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా హాజరైన గ్రామ ప్రజలను ఉద్దేశించి యూనియన్ బ్యాంక్ మేనేజర్ పరమేష్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి అనువల్య బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ చైతన్య గౌడ్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గడచిన పదేళ్లలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభించడం జరిగిందని ఆ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతోనే 2023 నవంబర్ నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులను కార్యక్రమంలో సమతుల్యం చేస్తూ వికసిత భారత్ సంకల్పయాత్ర ప్రారంభించడం జరిగిందని పార్టీలకు సంబంధం లేకుండా బ్యాంకింగ్ పోస్ట్ ఆఫీస్ వైద్య ఆరోగ్య వ్యవసాయ గ్యాస్ ఏజెన్సీ తదితర ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో జనవరి 26 వరకు వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. బ్యాంకులు పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రధానమంత్రి జీవన్ సురక్ష యోజన ప్రధానమంత్రి సౌభాగ్య యోజన అటల్ పెన్షన్ యోజన వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వంలో నిర్వహించే ఆయుష్మాన్ భారత్ పథకం జనరిక్ మందుల పంపిణీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా ఉజ్వల యోజన సిలిండర్ల పంపిణీ వాటి వినియోగం తదితర వివరాలు తెలియజేయడం జరిగింది. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ కార్యక్రమం క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పరమేష్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అనువల్య, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ చైతన్య గౌడ్, ఆరోగ్య మిత్ర బి రమాదేవి, పడమటి తండా సర్పంచ్ పుల్జిన్ నాయక్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## నెహ్రూ యువ కేంద్ర విభాగంలో ఉపన్యాస పోటీలు



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** నెహ్రూ యువ కేంద్ర విభాగంలో పాలమూరు జిల్లా అధికారి కోటనాయక్ ఆదేశానుసారం వివేకానంద 161 జయంతి సందర్భంగా బుధవారం విద్యా పారామెడికల్ కళాశాలలో యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవింద్ గుప్త మాట్లాడుతూ యువకులు చదువుకొనే కాదు ప్రతి రంగంలో విద్యార్థిని, విద్యార్థులు రాణించాలి అంతేకాకుండా స్వామి వివేకానంద దేశ ప్రఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేశారు. మనం కూడా మార్గదర్శనలో వెళ్లి దేశ ఔన్నత్యాన్ని పెంచాలని ఎన్వైకేఎస్ విభాగం కళాశాల నందు ఉపన్యాస పోటీలు పెట్టి విద్యార్థినిల ప్రతిభను గుర్తుపట్టినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఇలాంటి మా కళాశాల నందు ఎల్లప్పుడూ మీకు తోడ్పడుతుందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. తదనంతరం విద్యార్థినులకు ప్రథమ బహుమతి అనూష, ద్వితీయ బహుమతి పూజిత అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్వైకేఎస్ వాలంటీర్ లు రాజేందర్ గౌడ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు తిరుమలేశ్, వనపర్తి వాలంటీర్ అభిలాష్ హౌదేకార్, కళాశాల యాజమాన్యం శరత్, భరత్ తదితర శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

**- టీటీడీ**



**టీ మీడియా, జనవరి 10, తిరుపతి :** తిరుపతి లోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు.

ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీటీడీ ఆగమసలహాదారులను సంప్రదించి బ్రహ్మోత్సవాలకు అవసరమైన బుక్‌లెట్ ను, శ్రీ సీతారాముల కల్యాణం ముహూర్త పత్రికను, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, క్యూలైన్లు, గ్యాలరీలు, రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. గ్యాలరీల్లోని భక్తులకు తలంబ్రాలు, అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు సర్వీస్ రూట్ ఏర్పాటు చేయాలన్నారు. మెరుగైన పారిశుద్ధ్యం కోసం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆలయం, కళ్యాణవేదిక వద్ద శోభాయమానంగా విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు.

## అలాంటి వారిని సహించం : సజ్జనార్ వార్నింగ్



**టీ మీడియా, జనవరి 10, హైదరాబాద్:** నిబద్ధత, క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తోన్న టీఎస్ఆర్టీసీ సిబ్బందిపై విచక్షణరహితంగా దాడులకు దిగడం సమజసం కాదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగింది. అయినా చాలా ఓపిక, సహనంతో వారంతా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి ఘటనలు సిబ్బందిలో ఆందోళన కలిగిస్తున్నాయంటూ ఆయన ట్వీట్ చేశారు.సంగారెడ్డి జిల్లా ఆందోల్ లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది సంఘటన. బైకర్ నిర్లక్ష్యంగా నడపి ప్రమాదానికి కారణమయ్యాడు. అయినా తన తప్పేం లేదన్నట్టు తిరిగి టిఎస్ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్‌పై దాడి చేశారు. దుర్భాషలాడుతూ విచక్షణరహితంగా కొట్టారు. ఇలాంటి దాడులను యాజమాన్యం అసలే సహించదు. ఈ ఘటనపై అందోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆవేశంలో సిబ్బందిపై దాడి చేసి అనవసరంగా ఇబ్బందులకు గురికావొద్దని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం విజ్ఞప్తి చేస్తుందని సజ్జనార్ పేర్కొన్నారు.

## ఏపీ హైకోర్టులో చంద్రబాబుకు భారీ ఊరట



**టీ మీడియా, జనవరి 10, అమరావతి :** టీడీపీ అధినేత చంద్రబాబు కు ఏపీ హైకోర్టు లో భారీ ఊరట లభించింది. అధికారంలో ఉన్నపుడు ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసులో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏపీ సీఐడీ చంద్రబాబుపై కేసులు నమోదు చేసింది. అయితే ఈ కేసుల్లో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిని పరిశీలించిన ఏపీ హైకోర్టు పలుమార్లు విచారించి తీర్పును రిజర్వ్ చేశారు. బుధవారం వాటిని పరిశీలించిన హైకోర్టు జడ్జి జస్టిస్ టి. మల్లికార్జునరావు మూడుకేసుల్లో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడం ఊరట కలిగించింది. అమరావతి ఔటర్ రింగ్ మాస్టర్ ప్లాన్ అలైన్‌మెంట్‌లో పార్టీ నాయకులకు అనుకూలంగా అలైన్‌మెంట్ చేశారని మద్యం టెండర్లలలో, ఉచిత ఇసుక వ్యవహారంలోనూ అక్రమాలకు పాల్పడారని సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ మూడు కేసుల విచారణ పూర్తయ్యేంతవరకు కేసులపై మాట్లాడవద్దని కోర్టు చంద్రబాబుకు సూచించింది. అదేవిధంగా మద్యం కేసులో కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ శ్రీనరేష్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తు తీర్పును ప్రకటించారు.

## ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** ఘనపూర్ కేజీబీవీ తెలుగు మీడియం/ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు తేదీ: 20-21 జనవరి 2024 వేదిక ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, తెలంగాణలో ఖేలో ఇండియా మహిళల కిక్‌బాక్సింగ్ లీగ్ పోటీలకు మొత్తం 37 విద్యార్థినిలు పాయింట్ ఫైవ్ టు అండ్ మ్యూజికల్ ఫామ్ ఫిజికల్ వెపన్లో విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సాయి చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆగారం ప్రకాష్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఈ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్నటువంటి అరాచకాలను ఆదుకోవాలి అని అంటే మహిళలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి అలాగే ఈ పోటీలలో మంచిగా చేసి మన స్కూల్ కి మన ఊరికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎస్ ఓం ఇంగ్లీష్ మీడియం లలిత, పి టి విజయలక్ష్మి కరాటే మాస్టర్ శివకృష్ణ, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు గంజాయి రమేష్ ,యూత్ కాంగ్రెస్ ఘనపూర్ టౌన్ అధ్యక్షుడు చిట్యాల లింగస్వామి, పటేల్, గోనెల శంకర్,బైనీ బాలరాజ్, బండారి రజినీకాంత్,అజీమ్ పాల్గొనడం జరిగింది.

## హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామ మందిరం

**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి :** హిందువుల ఆరాధ్య దైవం శ్రీరామ మందిరం అయోధ్యలో నిర్మించడం జరిగింది 22-1-2024 వ రోజున శ్రీ బాలరాముని నూతన విగ్రహా ప్రాణ ప్రతిష్ట చేయడం కార్యక్రమంలో భాగంగా అయోధ్య రామ మందిరంలో పూజ చేసిన అక్షింతలు,ఫోటో మరియు ఆహ్వాన పత్రికలను సుల్తానాబాద్ మండల కేంద్రంలోని వేణుగోపాస్వామి గుడి నుండి మంగళ హారతులతో ఊరేగింపుగా అక్షింతలు, ఫోటో, ఆహ్వాన పత్రికలను ద్వారకనగర్, పుసాలరోడ్ లో గడప గడపకు పంపిణీ చేశారు.

# త్వరలో కొత్త విద్యుత్తు పాలసీ..

**- సీఎం ఉన్నత స్థాయి సమీక్ష**
**- 24 గంటలనిరంతర విద్యుత్తును అందించాల్సిందే**
**- గృహజ్యోతి కింద 2వందల యూనిట్లకు ఏర్పాట్లు**



**టీ మీడియా, జనవరి 10,హైదరాబాద్:** విద్యుత్తు రంగ నిపుణులు, వివిధ రాష్ట్రాల విద్యుత్తు విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో చర్చించి తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర విద్యుత్తు విధానాన్ని అమలుచేయాల్సిన అవసరముందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబులతో కలిసి నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్తు వినియోగం, 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరా, విద్యుత్తు సంస్థల ఉత్పత్తి, కొత్తగా ఉత్పత్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల్లో ఇచ్చిన గృహజ్యోతి పథకానికి 2వందల యూనిట్లను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు వంటివాటిపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, వివిధ విద్యుత్ కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోళ్లు, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం, డిస్కమ్ల పనితీరు, ఆర్థిక పరిస్థితిపైనా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014 నుంచి ఇప్పటిదాకా విద్యుత్ కంపెనీలకు, విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) మధ్య జరిగిన ఒప్పందాలు, ఆ ఒప్పందాల్లోని అంశాలు, విద్యుత్తుకు చెల్లించిన ధరలు వంటివాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి, పూర్తి వివరాలను అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్థిక సంవత్సరాల వారీగా జరిగిన ఒప్పందాలను, వాటిలోని అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కువ ధర చెల్లించే విధంగా జరిగిన ఒప్పందాలకు కారణాలేమిటో కూడా నివేదించాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ఎక్కడ తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందో, ఆ కంపెనీల నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటిదాకా సరైన విద్యుత్ పాలసీని రూపొందించకపోవడంతో వివిధరకాల ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యుత్తు విధానాలను అధ్యయనం చేయాలని, ఆ రాష్ట్రాల్లోని విద్యుత్తు పరిస్థితులు, మెరుగైన విధానం ఏ రాష్ట్రంలో ఉందో అధ్యయనం చేసి, నివేదికలను ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

అన్ని రాష్ట్రాలకంటే మెరుగైన విద్యుత్తు విధానాన్ని తెలంగాణలో అమలుచేయడానికి నిపుణులతో చర్చించి, అసెంబ్లీలోనూ అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, సరికొత్త విద్యుత్ పాలసీని తీసుకు వస్తామని సీఎం అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పరంగా విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి, మరిన్ని విద్యుత్ సంస్థలను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. విద్యుత్తును నిరంతరం సరఫరా చేయడంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా పటిష్టంగా, ముందస్తు చర్యలను చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఫైనాన్స్ స్పెషల్ సీ రామకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ట్రాన్స్ కో సీఎండి రిజ్వీ, టిఎస్ఎస్పీడిసిఎల్ సీఎండీ ముషార్రఫ్ ఫారూఖీ, సీఎంఓ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల చలో క్యాంప్ ఆఫీస్

**-పలువురు అరెస్ట్ లు**



**టీ మీడియా, జనవరి 10,విజయవాడ:** డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలంటూ డీవైఎఫ్ఐ కార్యకర్తలు, నిరుద్యోగులు 'చలో సీఎం క్యాంపు కార్యాలయం' ముట్టడికి ఉద్రిక్తతకు దారి తీసింది. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని బుధవారం వీరంతా విజయవాడ నుంచి తాడేపల్లికి బయలుదేరారు. రాఘవయ్య పార్కు వద్ద పోలీసులు ముందే అక్కడ మోహరించి ఉండటంతో.. బెంజిసర్కిల్ నుంచి సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి బయలుదేరి వెళ్లారు. నేతాజీ వంతెన వద్దకు చేరుకోగానే వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొనడంతో ముట్టడికి వచ్చిన నిరుద్యోగులను, డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తక్షణమే 25వేల పోస్టులతో మెగా డిఎస్సి విడుదల చేయాలని నినాదాలు చేశారు.

## బ్రహ్మోత్సవాల కు ఘనంగా ఏర్పాట్లు

**-టీటీడీ జేఈవో**



**టీ మీడియా, జనవరి 10,తిరుపతి :** తిరుపతిలోని ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తిరమల తిరుపతి దేవస్థానం జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీటీడీ ఆగమసలహాదారులను సంప్రదించి బ్రహ్మోత్సవాలకు అవసరమైన బుక్‌లెట్‌ను, శ్రీ సీతారాముల కల్యాణం ముహూర్త పత్రికను, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు , క్యూలైన్లు, గ్యాలరీలు, రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలన్నారు.గ్యాలరీల్లోని యాత్రికులకు తలంబ్రాలు, అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు సర్వీస్ రూట్ ఏర్పాటు చేయాలన్నారు. మెరుగైన పారిశుద్ధ్యం కోసం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఆలయం, కళ్యాణవేదిక వద్ద శోభాయమానంగా విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు.

## పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి బాధితునికి అప్పగింత



**టీ మీడియా, జనవరి 10, మహానంది:** మహానంది క్షేత్రానికి దర్శనానికి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన బిక్షపతి కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం క్షేత్రానికి దైవదర్శనానికి వచ్చారు. వారు బంగారు గొలుసును పోగొట్టుకోవడంతో దేవస్థానం వారికి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దేవస్థానంలోని సిసి కెమెరాల ద్వారా గుర్తించి, మూడు రోజుల్లోనే పోయిన మూడు తులాల బంగారు గొలుసును మహానందికి తెప్పించారు. బుధవారం మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్, ఆలయ ఏఈఓ మధు ఆధ్వర్యంలో బాధితులకి అప్పగించారు. ఈ సందర్భంగా బాధితులు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డికి మహానంది ఎస్ఐ జి. నాగేంద్రప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తులతో కిక్కిరిసిన మహానంది క్షేత్రం



**టీ మీడియా, జనవరి 10, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో వేలాదిమంది భక్తులతో బుధవారం కిక్కిరిసిపోయింది. పాఠశాలలకు సెలవు దినాలు కావడంతో క్షేత్రం పరిసరాలు భక్త జనసంద్రంతో నిండిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మహానందికి తరలివచ్చారు. తెల్లవారుజామున నుండే భక్తులు కోనేరులలో పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామి అమ్మవార్ల దర్శనం నిర్విరామంగా కొనసాగింది.క్షేత్ర పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను ఆమోదించిన గవర్నర్




**టీ మీడియా, జనవరి 10, హైదరాబాద్ :** టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఐదుగురు సభ్యుల రాజీనామాలను గవర్నర్ తమిళి సై బుధవారం ఆమోదించారు. గత సంవత్సరం డిసెంబర్‌లో టీఎస్‌పీఎస్ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి రాజీనామా చేశారు. కాగా, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. ఆ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆయన లేఖ రాశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు చేసి నెల రోజులు గడుస్తున్నా.. గవర్నర్ వాటిని ఇంత వరకు ఆమోదించడం లేదని అన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ బుధవారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలకు ఆమోదం తెలిపింది.

## పరామర్శించిన మాజీ మంత్రి



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని గంధం. బాలకృష్ణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి .బి.అర్.యస్ నాయకులు గంధం. బాలపీరు చెల్లెలు బాలకృష్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణమ్మను గుర్తుకు చేసుకుంటూ తనను పెద్ద అన్నయ్యగా గౌరవిస్తూ ఎంతో ఆప్యాయత, అనురాగం కలిగివుండేది అని సొంత చెల్లిని కోల్పోయినట్లుగా ఉందని అన్నారు.నిరంజన్ రెడ్డి వెంట ఛైర్మెన్ గట్టు యాదవ్ కౌన్సిలర్స్ బండారు. కృష్ణ, పాకనాటి.కృష్ణ, కంచె.రవి, నాయకులు గంధం.పరంజ్యోతి, శరవంద,గంధం.నాగరాజు, గంధం.కృష్ణాయ,రాంచందర్ ఉన్నారు.

## ఇరుముడి కార్యక్రమములో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో** :అయ్యప్ప స్వామినీ దర్శించుకొని ఇరుముడి కార్యక్రమములో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి . 41రోజులు దీక్ష చేసుకొని శబరిమల యాత్రకు బయలుదేరుతున్న గురుస్వాములను నిరంజన్ రెడ్డి సన్మానించారు. యాత్రకు బయలు దేరుతున్న బి.అర్.యస్ సోషల్ మీడియా కన్వీనర్ నారికేళ గురుస్వామి, బీచుపల్లి యాదవ్, నరేందర్ గురుస్వామి బృందానికి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమంతాసుఖసంతోషాలతో వుంటూ తాము కూడా సుభిక్షంగా ఉండాలని 41రోజులు కఠినంగా దీక్ష చేసి శబరి మల దర్శనాన్నికి వెళు తున్న అయ్యప్పలందరికి నిరంజన్ రెడ్డి అభినందనలు తెలియజేస్తూ వారి యాత్ర దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ గట్టు యాదవ్,వైస్ చైర్మన్ వాకిటి. శ్రీధర్, గురుస్వాములు గట్టు.వెంకన్న, లక్ష్మినారాయణ, చెన్న రాములు , నందిమల్ల. అశోక్, పుట్టపాక.మహేష్ నాయకులు తిరుమల్, కంచె.రవి,చిట్యాల.రాము పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు

**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన( తెలుగు వీధి కి చెందిన) టి రాముడు కు ఆరోగ్య చికిత్స నిమిత్తం కొరకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు కొరకు పంపించడంతోబాధితునికి రూ. 1,50,000/- (అక్షరాల లక్ష యాభై వేల రూపాయలు) ఎల్ ఓ సి మంజూరు అయినది. ఇట్టి ఎల్వోసీ ని స్థానిక శాసనసభ్యులు తూడి మేఘ రెడ్డి ఆదేశాల మేరకు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబీకులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ మైనార్టీ నాయకులు ఎండి రహీం చేతుల మీదుగా అందజేశారు. అనంతరం తనకు సహకరించిన ఖిల్లా గణపురం మండలం కాంగ్రెస్ నాయకులు సాయి చరణ్ రెడ్డి. రమేష్ కు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా వాల్మీకి బోయ ముద్దు జయంతి వేడుకలు



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా గోపాల్ పేట్ మండలం లలితా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రుక్మేందర్ వాల్మీకి బోయ జాతి ముద్దు బిడ్డ దక్కన్ తెలంగాణ యుద్ధ వీరుడు సర్దార్ గుజ్జుల హనుమప్ప నాయుడు 324 వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు కూజాంతం రామరామేతి మధురం మదురాక్షరం ఆరూహ్య కవితాశాకం వందే వాల్మీకి కోకిలమ్ అంటూ జై వాల్మీకి,జై జై వాల్మీకి అని నినాదాలు చేస్తూ తెలుగు పుస్తకంలో వున్న సర్దార్ హనుమప్ప నాయుడు జీవిత చరిత్ర పాఠాన్ని తోటి విద్యార్థులకు వివరించారు. పాఠశాల చిన్నారులు ఉపన్యాసాలు ఇవ్వటం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ రుక్మేందర్ మాట్లాడుతూ సర్దార్ హనుమప్ప నాయుడు గద్వాల సంస్థానము పాలనాకాలంలో గద్వాల సంస్థాన స్థాపక ప్రభువు పెద్ద సోమ భూపాలుడు ( నల సోమనాద్రికి) సమకాలికుడు , హనుమప్ప నాయుడు ధైర్యశాలి,సాహసి, రాజకార్యసూర్యుడు,ప్రాణాలను తెగించి తన ప్రభువు విజయానికి దోహదపడిన కార్యశూర్యుడు, అశ్వమే బలమైన ఆయుధంగా, ఆశయంగా, ప్రేరణగా, స్ఫూర్తి గా ,ధైర్యశాలిగా, ధీరునిగా , యోధుడు అని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రాములమ్మ మాట్లాడుతూ వాల్మీకి విజ్ఞానానికి ప్రతీకగా, ఏకలవ్యుడుని ఏకగ్రాతకి, సంకల్పశక్తికి, గురుభక్తికి ప్రతీకగా, గుహుడుని స్నేహశీలిగా , ధర్మవ్యాధుడిని ధర్మానికి ప్రతీకగా, తిన్నడు,శబరిలను భక్తి తత్వానికి మారు రూపకంగా, సర్దార్ గుజ్జుల హనుమప్ప నాయుడు ని సాహసానికి ప్రభుభక్తి కి నిదర్శనంగా వీరందరూ భావితరాలకు స్ఫూర్తి, దృఢసంకల్పం, మిక్కిలి పట్టుదల, ఏకగ్రాత వున్న మానవులు దేనినైనా సాధించగలరు. గురుతర కార్యక్రములు సాధించుటకు పట్టుదల సాధనే ముఖ్యం అని చిన్నారులు మహనీయుల స్ఫూర్తి తో , చదువు అనే ఆయుధంతో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుక్మేందర్, కరస్పాండెంట్ రాములమ్మ, టీచర్లు శివ,సునిత, పుష్పలత, రజిత, లక్ష్మీ అత్యధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ముస్లిం నాయకులు మీడియా సమావేశం



**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి :** ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం సమాజాన్ని ఏకతాటి పైకి తెచ్చి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు విశేషంగా కృషిచేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వక్ఫు బోర్డు మాజీ చైర్మన్ కుసుర్ పాషా కు క్యాబినెట్ హోదా కల్పించాలని పెద్దపల్లి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు రహీముద్దీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్తాక్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం నాయకులు పెద్దపల్లి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు రహీముద్దీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్తాక్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వక్ఫు బోర్డు మాజీ చైర్మన్ కుసుర్ పాషకు క్యాబినెట్ హోదా కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో కుసుర్ పాష కీలక పాత్ర పోషించారని, ఆయనకు క్యాబినెట్ హోదా కల్పిస్తే ముస్లిం సమాజానికి సేవ చేసే అవకాశం ఉంటుందని, కుసుర్ పాషా కు క్యాబినెట్ హోదా వచ్చే విధంగా మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, గడ్డం వివేక్ వెంకటస్వామి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నదీమ్, మేరాజ్, రవూఫ్, హకీం, షేక్ అహ్మద్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి విరాళం

**- అందజేసిన గండు రంగయ్య**



**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి, పెద్దపల్లి పట్టణ సుభాష్ నగర్ చెందిన రైతు నాయకులు గండు రంగయ్య. రూ.50,000 వేలు, బొద్దుపల్లి వెంకటేశం, రూ 10,000 వేలు విరాళాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్మాణం నాయకులు బొద్దుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతు నాయకులు గుండు రంగయ్య , గతంలో ఎల్లమ్మ చెరువు గుండం చెరువు, నీటి సంఘం అధ్యక్షులుగా పని చేసినారు. వారు కట్ట మైసమ్మ గుడి నిర్మానించాలని సంకల్పంతో గుడికి విరాళంగా డబ్బులు అంద చేయడం జరిగినది. దాతలు నూనె పరమేశ్వర్ , ట్రాక్టర్ ఇసుక, ఉమర్ ట్రాక్టర్ కంకర, కొమరిశెట్టి చంద్రమౌళి, ట్రాక్టర్ కంకర అందజేయడం జరిగినది, వీరందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను., ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కౌన్సిలర్ పోతని పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు దొడ్డిపల్లి జగదీష్, గుడి కందుల మల్లయ్య, పావునూరి లక్ష్మణ్, బొద్దుపల్లి అశోక్, భూషణ వేన రాజయ్య గౌడ్, రమేష్, రాచమల్ల అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## షోకాజ్ నోటీసులపై అంగన్వాడీల ఆగ్రహం

**- మహానంది తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు**



**టీ మీడియా, జనవరి 10, మహానంది:** గత 30 రోజులుగా అంగన్వాడి కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా ధర్నాలు నిర్వహిస్తున్న, అంగన్వాడీల ఇండ్లకు బుధవారం నాడు నోటీసులు అంటించడం వల్ల మహానంది తహసిల్దార్ కార్యాలయం వద్ద జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డిని నిలువరించి కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అంగన్వాడీలు తహసిల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు మరియు రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా నిర్వహిస్తున్న సమ్మెకు నీరుకార్చేవిధంగా, ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం అమలులోకి తెచ్చి, అందులో భాగంగా అంగన్వాడీల ఇండ్లకు నోటీసులు అంటించడం ఏంటి అని నిలదీశారు. అటువంటి నోటీసులు ఏవైనా ఉంటే ప్రభుత్వ అంగన్వాడి స్కూల్ లకు కానీ, పోస్టల్ ద్వారా కానీ మాకు చేరవేయాలి తప్ప ,ఆ విధంగా ఇండ్లకు అంటించడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ లను తీర్చలేక ప్రభుత్వం, అంగన్వాడీలపై కక్షపూరిత చర్యలకు దిగిందన్నారు. గత 30 రోజులుగా మా న్యాయమైన పోరాటాల కోసం సమ్మె చేస్తున్న, రాష్ట్ర ముఖ్యమంత్రి మా కోసం ఐదు నిమిషాలు సమయం కూడా కేటాయించలేకపోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మీ న్యాయమైన కోరికలు తీర్చే విధంగా ఎమ్మెల్యే దృష్టికి మీ సమస్యను తీసుకువెళ్తారని హామీ ఇవ్వడం జరిగింది. తహసిల్దార్ జనార్ధన్ శెట్టి మాట్లాడుతూ మేము ప్రభుత్వంలో భాగంగా మా ఉన్నతాధికారులు సూచించిన విధంగానే నోటీసులు అంటించడం జరిగిందని, మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా టి .రామచంద్రుడు రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యలపై దృష్టి పెట్టకుండా, వారి సమస్యల పరిష్కారం కోసం చర్చించకుండా ముఖ్యమంత్రి సలహాదారు సజ్జల రామకృష్ణ మాటలు విని అంగన్వాడి ల సమ్మెను, సమస్యలను నీరుగార్చే విధంగా ఎస్మా చట్టం ప్రయోగించడం, ఇండ్లకు నోటీసులు అంటించడం చాలా దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సావిత్రి, నారాయణమ్మ, జ్యోతి, ఉషారాణి, గౌరీ, చండీ దేవిలు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




**టీ మీడియా, జనవరి 10, చిన్నంబావి :** చిన్నంబావి మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్ ను తహశీల్దార్ ఎండి ఇక్బాల్,డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బడికల రామచంద్రయ్య, మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల పాలిట శాపం గా మారిన కాంట్రి బ్యూటరి పెన్షన్ విధానాన్ని (సి.పి.యస్) ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అర్ధాంతరంగా ఆగిపోయిన ఉపాధ్యాయ ప్రమోషన్లు మరియు బదిలీలు చేపట్టాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో మండల ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు మందగిరి రాజు, నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, సీనియర్ నాయకులు రమేష్, నాగరాజు, రోహిణి, మాధవి, ఉపాధ్యాయ సంఘ సభ్యులు చందు, సల్మాన్, శైలజ, వసీం, రామకృష్ణ ,కరుణాకర్, నరేందర్, పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## రామజన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణి

**- బీఆర్ఎస్ యువజన నాయకులు వజ్రాల రమేష్**



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట పైన ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు వజ్రాల రమేష్ ఆధ్వర్యంలో రామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలు ఇంటింటికీ పంచడం జరిగింది. ప్రజలు భక్తి ప్రపత్తులతో దర్శించుకున్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మోక్ష,నితిన్, శర్మ, విజయ్, రఘు, రామచంద్ర, నాగమ్మ,లావణ్య, గాయత్రి, శివమ్మ, శివాని, రాధా తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ భరోసా సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ చిల్డ్రన్ సెంటర్లో

**- కాంట్రాక్టు బేస్ నియామకాలకు దరఖాస్తులు స్వీకరణ**
**- జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజవత్**



**టీ మీడియా, జనవరి 10, వనపర్తి బ్యూరో :** రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ పర్యవేక్షణ లో నడిచే భరోసా -సొసైటీ పర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్%d% చిల్డ్రన్ ను జిల్లా లో పోలీస్ శాఖ అధ్వర్యంలో నడపబడుతున్నది. అందులో కాంట్రాక్ట్ బేస్ క్రింద వివిధ పోస్టులలో పనిచేయుటకు జిల్లాలో అర్హత గల మహిళలు క్రింద సూచించిన లింక్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ రామదాసు తేజవాత్ తెలిపారు.కాంట్రాక్టు బేస్ క్రింద ఒక సంవత్సరం పాటు ఈ పోస్టులకు నియమించబడి తదనంతరం సంవత్సరానికి ఒక సారి వారి నియామకాన్ని పొడగించడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

పోస్టులు, విద్య వయస్సు అర్హతలు :

1. లీగల్ సపోర్ట్ ఆఫీసర్, అర్హతలు :ఎల్ఎల్ బి(బ్యాచిలర్ ఆఫ్ లెజిస్లేటివ్ లా లేదా బాకలారియస్)/ఎల్ఎల్ ఎంతో 2 సంవత్సరాల అనుభవం, వయస్సు: 25-40 సంవత్సరాలు.

2. సపోర్ట్ వ్యక్తి-02
అర్హత : పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్ సోషల్ వర్క్ /చైల్డ్ డెవలప్మెంట్/ సైకాలజీ.
సోషల్ వర్క్/ చైల్డ్ డెవలప్మెంట్ /సైకాలజీ /లో పోస్ట్ గ్రాడ్యుయేట్ తో పాటు 12 నెలల వరకు ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ను కలిగి ఉండాలి.
వయస్సు : 25- 35.

3. రిసెప్షన్ -01
అర్హత: డిగ్రీ అర్హతతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండి ఇ ఆర్ పి, టాలీ లో పరిజ్ఞానం కలిగి ఉండాలి.కంప్యూటర్ నాలెడ్జితో పాటు ఇ ఆర్ పి, టాలీ లో 24 నెలలు వర్క్ ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. వయస్సు : 25 - 35.

పైన చూపిన పోస్టులకు పై విద్య అర్హతలు ఉన్న మహిళలు బయో డేటా, విద్య అర్హత సర్టిఫికెట్ కాపీ తో https://womensafetywing.telangana.gov.in/careers/ లింక్ లో ఆన్లైన్ లో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ తెలిపారు.

## శ్రీరాంపూర్ మహిళా పోలీస్ స్టేషన్లో టీ మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ




**టీ మీడియా, జనవరి10,** రామగుండం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శ్రీరాంపూర్ మహిళా పోలీస్ స్టేషన్ లో ఈరోజు సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో టీ మీడియా 2024 క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది,టీ మీడియా క్రైమ్ రిపోర్టర్ వినయ్ పాల్గొనడం జరిగింది.

## నూతన మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పత్రాలను అందజేసి అభినందనలు తెలిపిన పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్

**- పోతరవేని క్రాంతి కుమార్**



**టీ మీడియా, జనవరి 10, మంథని :** మంథని మండలం విలోచవరం గ్రామంలో 35 మంది సభ్యులతో కూడిన మహిళ మత్స్యపారిశ్రామిక సంఘం ను ఏర్పాటు చేసి చీఫ్ ప్రమోటర్ గా జునుగరి శ్రుతి ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డైరక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ మంథని మండలంలోని ప్రతి గ్రామంలో మహిళలు ముందుకు వచ్చి మహిళ మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలని, మన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఈ మహిళ మత్స్యశాఖ సంఘాలకు సహాయ సహకారాలు అందించాలని అలాగే ఈ విలోచవరం మహిళ సొసైటీ ఏర్పాటు కు సహకరించిన పెద్దపల్లి డిఎఫ్ఓ అధికారి భాస్కర్ గారికి కృషి చేసిన విలోచవరం మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు జునుగరి బాపు గారికి సర్పంచ్ బండ రమేష్ గారికి ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమం లో మత్స్యశాఖ ఉపాధ్యక్షులు నరెడ్ల బొంద్యాలు కార్యదర్శి జునుగరి రాజయ్య ఉపసర్పంచ్ తూడ్ల అంజన్న తో పాటు మహిళ మత్స్యశాఖ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ కు పత్తి విక్రయాలు నిలిపివేత

**టీ మీడియా, జనవరి 10, పెద్దపల్లి :** రైతు సోదరులకు, మార్కెట్ వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా సంక్రాంతి పండుగ పురస్కరించుకొని, వ్యాపారస్తుల విజ్ఞప్తి మేరకు 11 జనవరి 2024 నుంచి 16 జనవరి 2024 మంగళవారం వరకు అనగా (6) రోజులు మార్కెట్ యార్డ్ నందు ఎలాంటి పత్తి క్రయవిక్రయాలు జరుపబడవు. తిరిగి బుధవారం అనగా 17 జనవరి 2024 నుంచి యధావిధిగా క్రయావిక్రయాలు జరుపబడును. గమనిక: బుధవారం నుంచి పత్తి తేమ శాతం 12% వరకు ఉన్నవాటినే కొనుగోలు చేయబడును. పత్తి తేమ శాతం 12% దాటిన వాటిని కొనుగోలు చేయబడదు, మార్కెట్ యార్డ్ కి అనుమతించబడదు. కావున రైతులు పత్తిని 12% మించకుండా మార్కెట్ యార్డ్ కి తీసుకురావాలని, మార్కెట్ కమిటీ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## విదేశీ ప్రతీ నిధులు కు సియం విందు

**టి మీడియా, జనవరి 10, హైదరాబాద్ బ్యూరో :** బుదవారం రాత్రి హైదరాబాద్ లోని కుతుబ్ షాహీ టూంబ్ ల వద్ద 13 దేశాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఆతిధ్యం ఇచ్చారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకె, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు హాజరు అయ్యారు ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వాగతం పలుకుతూ తమ ప్రభుత్వం యొక్క ప్రాధాన్యతలను వివరించారు.



### అభయహస్తం కింద అన్ని వర్గాల అభ్యున్నతికి

నూతనంగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ తదితర నేతల ఆశయాలను, మాజీ ప్రధాని ఇందిరా గాంధీని స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, పారదర్శకత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆరు హామీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయా దేశాలకు విజ్ఞప్తి చేశారు. అన్ని దేశాలలో సత్సంబంధాలు కొనసాగించటానికి తమ ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రయత్నిస్తుందని తెలిపారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి చేయుటకు ముందుకు రావాలని కోరారు. అందుకు తగిన సూచనలు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీ దామోదర రాజనర్సింహ, శ్రీ శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, శ్రీ జయేష్ రంజన్, హైదరాబాద్ రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ గారు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్రాంతి తర్వాత అందరికీ రైతుబంధు

**-మంత్రి తుమ్మల నాగేశ్వరావు**

**టీ మీడియా, జనవరి 10,కూసుమంచి (ఖమ్మం )**సంక్రాంతి పండుగ అయిపోగానే రైతులందరికీ రైతుబంధు అందుతుందని మంత్రి తుమ్మల తెలిపారు.ఖమ్మం జిల్లా కూసుమంచిలో మంత్రి పొంగులేటి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రైతుబంధుపై అపోహలు వద్దని కోరారు. తమ ప్రభుత్వంలో నిజమైన అర్హులకు పథకాలు అందిస్తే తమ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కాగా.. ఆనాటి సీఎం కేసీఆర్.. మాటలకే పరిమితం అయ్యారని విమర్శించారు. కానీ.. ఈనాటి సీఎం రేవంత్ ద్వారా ప్రజల వద్దకు పథకాలు వెళుతున్నాయని తెలిపారు. రేవంత్ రెడ్డి శ్రమ సక్సెస్ కావాలని ఆయన కోరారు. ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులం ఈ జిల్లా కోసం పాలేరుకు సీతారామ ప్రాజెక్ట్ జలాలు వచ్చేలా చూస్తామమన్నారు. ఇది ఇలా ఉంటే ఎంత అహంకారం ఉన్నా.. ప్రజల ముందు దిగదుడుపే అని తెలంగాణ ప్రజలు నిరూపించారన్నారు. తెలంగాణలో కబ్జాల రాజ్యం పోవాలని ప్రజలు కోరుకున్నారని.. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఖమ్మం జిల్లాకు ఈ ఏడాదిలోనే నీరు ప్రవేశిస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.




పది లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడం కాంగ్రెస్ లక్ష్యమన్నారు. తన జీవిత కాలంలో చివరి కోరిక ఇదేనన్నారు. నిన్న ప్రాజెక్ట్ కు సంబంధించిన నీళ్ల కోసం నిధులు కేటాయించామని తెలిపారు. టన్నెల్ పూర్తి కాగానే పాలేరుకు నీళ్లు వస్తాయని మంత్రి చెప్పారు. పాలేరుకు నీళ్లు వచ్చేలా తాము పొంగులేటితో కలసి ఇద్దరం చేస్తామన్నారు. పాలేరు ఖమ్మం తమ దృష్టిలో ఒక్కటేనని తెలిపారు. తాము జీవితాంతం రుణపడి ఉంటామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.




# ఆదిలాబాద్‌లో అవినీతి చేపలు

**-ఆమ్యామ్యా తీసుకుంటూ ఏసీబీకి బుక్కైన వైనం**

**టీ మీడియా, జనవరి 10,మంచిర్యాలబ్యూరో :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. నిర్మల్, మంచిర్యాల జిల్లాలో ఏసీబీ వరుస దాడులకు అవినీతి చేపలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాయి. నిర్మల్ జిల్లా కడెం మండలంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ కడెం ఎమ్మార్వో, డీటీ పట్టుబడగా.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు జరిపిన దాడుల్లో 15 వేల రూపాయల లంచం తీసుకుంటూ కాసిపేట పంచాయితీ రాజ్ ఏఈ పట్టుబడ్డారు.మంచిర్యాల జిల్లాలోని



బెల్లంపల్లి ఎంపిడివో కార్యాలయంపై ఏసీబీ అదికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాదితుని వద్ద నుండి 15 వేలు లంచం తీసుకుంటూ కాసిపేట పంచాయతీ రాజ్ ఏఈ పరంజ్యోతి ఏసీబీ అదికారులకు చిక్కారు. ఏఈ పాత పనికి బిల్లు కోసం లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో ఏఈ పెర్కపల్లి పంచాయతీ సెక్రెటరీ వీరబాబు ద్వారా రూ. 15 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. ఏఈ పరం జ్యోతి, పెర్కపల్లి పంచాయతీ కార్యదర్శి వీర బాబును అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.అటు నిర్మల్ జిల్లాలోను ఇద్దరు అవినీతి అదికారులు ఏసీబీకి చిక్కారు. కడెం ఎమ్మార్వో కార్యలయంలో ఓ రైతు వద్ద నుండి 9 వేల రూపాయల లంచం తీసుకుండగా తహసీల్దార్ రాజేశ్వరితో పాటు డీటీ చిన్నయ్య ఏసీబీ అదికారులకు దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్త మద్ది పడగా గ్రామానికి చెందిన లాసెట్టి రాజన్న చెందిన 24 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి 15 వేలు ఎమ్మార్వో రాజేశ్వరీ డిమాండ్ చేయగా.. బాదితుడు ఏసీబీ అదికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అదికారులు.. డిప్యూటీ ఎమ్మార్వో చిన్నయ్య బాదితుడి వద్ద నుండి డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని.. నిందితులను కరీంనగర్ ఏసీబీ కోర్ట్ లో రిమాండ్ చేస్తామని తెలిపారు.

**భారత్ జోడో న్యాయ్ యాత్రకు..**

# అనుమతి నిరాకరణ

**టీ మీడియా, జనవరి 10,న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడ్డంకులు ఎదురయ్యాయి. జనవరి 14న తూర్పు ఇంఫాల్‌లోని హట్టా కాంగ్జెబుంగ్‌లో బహిరంగ ర్యాలీ నుండి యాత్రను ప్రారంభించనున్నట్లు పార్టీ ప్రకటించింది. అయితే బహిరంగ ర్యాలీ చేపట్టేందుకు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. అనుమతి నిరాకరణపై సీనియర్ కాంగ్రెస్ నేత కెసి. వేణుగోపాల్ స్పందించారు. ఎన్నికల సన్నాహాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా యాత్ర చేపడతామని అన్నారు. ఇది రాజకీయ యాత్ర కాదని, ఈ దేశ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ తగిన సమయంలోనే పోలీస్



క్లియరెన్స్‌ను అభ్యర్థించిందని చెప్పారు. ఎదురు దెబ్బలు యాత్రను అడ్డుకోలేవని అన్నారు. ఈ సమస్యను రాజకీయం చేయబోమని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పేరుతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాహుల్ యాత్రకు అనుమతి నిరాకరించారని మణిపూర్ పిసిసి అధ్యక్షుడు కె.మేఘచంద్ర తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం దురదృష్టకరమని, ఈ చర్య ప్రజల, రాజకీయ హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో యాత్రకు అనుమతి లేకపోవడంతో.. థౌబాల్ జిల్లాలోని ఓ ప్రైవేటు స్థలానికి మార్చినట్లు మేఘచంద్ర వెల్లడించారు.కాగా, రాహుల్ చేపట్టనున్న 'భారత్ జోడో న్యాయ్ యాత్ర ' జనవరి 14న ప్రారంభమై మార్చి 30న ముగుస్తుంది. 66 రోజులపాటు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా దాదాపు 6,713 కిలోమీటర్ల పాటు కొనసాగనుంది.